క్లుప్తంగా

ఘనంగా మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న జెడ్‌సీ పంకజ

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, హయత్‌నగర్ సర్కిళ్లలో పని చేసే మహిళా అధికారులు, సిబ్బందితో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ మహిళా సిబ్బంది, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

బీఎన్‌రెడ్డినగర్‌లో...

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని కల్యాణ మండపంలో మహిళ పారిశుద్ధ్య కార్మికుల కోసం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీదివాకర్, ప్రాజెక్ట్ అధికారి బలారాం, సూపర్‌వైజర్ అజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత



చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులకు భగవాన్ సత్యసాయి బాబా సేవా సమితి సరూర్‌నగర్ శాఖ కన్వీనర్ హరీష్‌రెడ్డి శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. సమితి సభ్యులు మణిపాల్‌రెడ్డి, అంజన్, బెనర్జీ, పాఠశాల ఉపాధ్యాయులు పద్మావతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు అన్యాయం చేస్తే లైసెన్సుల రద్దు

ఎస్జీఎస్ దామోదర్

చాదర్‌ఘాట్: మిర్చి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మిర్చి వ్యాపారులు సిండికేట్ అయి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తే అలాంటి వారి లైసెన్సులను రద్దు చేస్తామని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ హెచ్చరించారు. శుక్రవారం మిర్చి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఖమ్మం, గుంటూరు మిర్చి మార్కెట్‌లలో ఉన్న రేటు ఈ మార్కెట్‌లో లేదని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సిండికేట్‌గా ఏర్పడి రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని వ్యాపారులను హెచ్చరించినట్లు తెలిపారు. మార్కెట్‌లో రోజూ బిడ్డింగ్ జరిగే సమయంలో నిఘా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో గ్రేడ్–3 అధికారి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు స్నాచింగ్

హస్తినాపురం: ఇంటి ముందు ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... వైదేహీనగర్‌కు చెందిన పున్నమ్మ(82) ఇంటి ముందు ఒంటరిగా కూర్చుంది. గమనించిన గుర్తు తెలియని యువకుడు ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తెంచుకుని పారియాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేలోగా స్నాచర్ పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

హస్తినాపురం: ఇంటి నుంచి బయటికెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు... ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన కనీశ్‌కుమార్ యాదవ్(31) తన భార్యతో కలిసి ద్వారకామయి నగర్‌లో ఉంటూ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గత నెల 21న ఇంటి నుంచి వెళ్లిన కనీశ్‌కుమార్ తిరిగి రాలేదు. దీంతో ఆయన ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏవీఎన్‌రెడ్డిని గెలిపించండి

ఉప్పల్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజవర్గ శాసన మండలి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దేవసాని బాలచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. పాఠశాల అధ్యాపకులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విఠల్, అలె నరేంద్ర, సంఘీ స్వామి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో దడ



చైతన్యపురి డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లోని ప్రధాన, అంతర్గత రహదారులనే తేడా లేకుండా దాదాపు అన్ని రోడ్లూ గుంతలమయమై అధ్వానస్థితికి చేరుకుంటున్నాయి. 'ఏ రోడ్డు చూసినా... ఏమున్నది గుంతలు, తవ్వకాలు తప్ప' అంటూ స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. అభివృద్ధి పేరుతో రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. పనులు పూర్తయిన తరువాత వాటికి మరమ్మతులు చేసే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

- అస్తవ్యస్తంగా సత్యనారాయణపురం–ప్రభాత్‌నగర్ రోడ్డు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

చైతన్యపురి: దాదాపు దశాబ్దకాలంగా గుంతలమయమైన ఆ రోడ్లను మరమ్మతు చేసే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఆయా రహదారులపై రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని.. ఒక్కోసారి ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు, వాహనదారులు పేర్కొంటున్నారు. సమస్యలను అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చైతన్యపురి డివిజన్ సత్యనారాయణపురం రోడ్డుతోపాటు పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా ఈ దారి చైతన్యపురి నుంచి ప్రభాత్‌నగర్, కొత్తపేట నాగోలుకు వెళ్లేందుకు దగ్గరి దారి కావటంతో ద్విచక్ర వాహనాలు, కార్లు ఎక్కువగా తిరుగుతుంటాయి. సీసీ రోడ్డు వేసేందుకు రెండు పర్యాయాలు టెండర్ ప్రక్రియ పూర్తయినా సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. టెండర్ దక్కించుకుని పనులు చేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టాల్సి ఉండగా అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించటం లేదు. ఇదిలా ఉండగా గత నెలలో రూ. 16 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేసేందుకు టెండర్ పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవటం గమనార్హం. 15 అడుగులు మాత్రమే వెడల్పు ఉన్న ఈ రోడ్డు మొత్తం గుంతలు పడింది. వర్షం వస్తే రోడ్డు మధ్యలో నీరు నిలిచి పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రహదారి బాగు చేయటంలో శ్రద్ధ చూపకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన నీరు

అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: అభివృద్ధి పనులను ప్రారంభించే విషయంలో జాప్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించమని.. జాప్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులతో వివిధ అభివృద్ధి పనుల విషయంపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పదిహేను రోజుల క్రితం చంపాపేట, లింగోజిగూడ డివిజన్‌లలో రూ. 4 కోట్ల నిధులతో ప్రారంభించనున్న అభివృద్ధి పనులకు కాలనీవాసులు శంకుస్థాపన చేసినా పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. దీనిపై పొంతనలేని సమాధానాలు ఇచ్చిన అధికారులపై సుధీర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లో ఆయా పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో సర్కిల్ ఈఈ కోటేశ్వరరావు, బీఆర్‌ఎస్ పార్టీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు నర్సింహ ముదిరాజ్, మధు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మహిళలకు ఉచిత న్యాయ సహాయం

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీదేవి

వనస్థలిపురం: అవసరమైన ప్రతి మహిళకూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.శ్రీదేవి పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శుక్రవారం వనస్థలిపురంలోని సఖి కేంద్రంలో నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ... అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, సఖి కేంద్రం సిబ్బంది ఈ సమాచారాన్ని ప్రతి మహిళకూ చేరవేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రీసోర్స్ పర్సన్స్ న్యాయవాది శ్యామలాదేవి, సామాజిక వేత్త, న్యాయవాది వృషాల మహిళల ప్రాథమిక హక్కులు, బాధ్యతలు, యాసిడ్ దాడులు, వరకట్న వేధింపులు, రేప్ అండ్ లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, కార్మిక చట్టాలు, కుటుంబ చట్టాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, ఉచిత లాయర్ (ఫ్రీ లీగల్ ఎయిడ్) గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సీపీడీఓ వర్కర్లు, సఖి సెంటర్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి: బీజేపీ

సైదాబాద్: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకయ్యే బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులను కలిసి పార్టీ కరపత్రాలను పంచిపెట్టారు. హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల భవిష్యత్‌ను ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు. కల్వకుంట్ల కుటుంబ అవినీతి పాలనకు ఈ ఎన్నికలతో పతనం ప్రారంభం అయిందన్నారు. పార్టీ నాయకుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జంగం మధుకర్‌రెడ్డి

వంటల పోటీలు

మీర్‌పేట: మహిళా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో మహిళా సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్‌కు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై వంటకాలను పరిశీలించి రుచి చూశారు. ఉత్తమ వంటకాలను ఎంపిక చేసి వారోత్సవాల్లో చివరి రోజున బహుమతులు అందజేస్తామని కమిషనర్ నాగేశ్వర్ తెలిపారు. ఈ పోటీల్లో పిండి, చిరు ధాన్యాలతో చేసిన వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆర్‌ఓ అంజన్‌రెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



వంటకాలను పరిశీలిస్తున్న మేయర్ దుర్గ

మంచి ఆహార అలవాట్లతో కిడ్నీల సంరక్షణ

వనస్థలిపురం: వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా శుక్రవారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ... ప్రతి ఆరు నెలలకు ఓసారి ఎల్‌ఎఫ్‌టీ, ఆర్‌ఎఫ్‌టీ, సీబీపీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కిడ్నీల పనితీరు ఎలా ఉందో తెలుసుకోవచ్చన్నారు. తద్వారా తగిన చికిత్స పొందడం... మంచి ఆహార అలవాట్లతో కిడ్నీలను సంరక్షించుకోవచ్చన్నారు. ఈ పరీక్షలు అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా చేయించుకోవచ్చని తెలిపారు. డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి నరేంద్రవర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది సైదులు, హసీనా, మహేష్ పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఎంఓ కృష్ణ తదితరులు

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధచూపాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న సుజాత తదితరులు

సైదాబాద్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దళిత్ ఉమెన్స్ కనెక్టివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూరేపల్లి సుజాత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఐఎస్‌సదన్‌లో దళిత్ ఉమెన్స్ కనెక్టివ్ సంస్థ, చాదర్‌ఘాట్ ప్రసూతి పిల్లల ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మట్లాడుతూ... ప్రస్తుత కాలంలో ఆరోగ్య పరిరక్షణ కోసం అందరూ తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. మహిళలు, గర్భిణులు తప్పని సరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. శిబిరంలో 200 మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య బృందం అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. సంస్థ ప్రతినిధులు రంజిత్‌కుమార్, పావని, దుశ్యంత్, యశోద, అనూషా, అఖిల, శ్రీను, హసన్‌బేగం, కృప, రమ, ఫాతిమా పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పాపిరెడ్డి కాలనీలో లక్ష్మీగణపతి సమేత శివ పార్వతి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజను వైభవంగా నిర్వహించారు. పూజాకార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్న రాంమోహన్‌గౌడ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు రవికుమార్, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వరరావు, జానకిరామ్, ప్రధాన కార్యదర్శి సాంబయ్య, కోశాధికారి సోమయ్య, సభ్యులు బాలునాయక్, సందీప్ రెడ్డి, చారి, సత్యవతి పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభకు పదును



వైజ్ఞానిక అంశాలను తిలకిస్తున్న కంచర్ల శివారెడ్డి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ శక్తినగర్, కర్మన్‌ఘాట్‌లో ఉన్న శ్రీ సాయివాణి విద్యానికేతన్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు వివిధ అంశాలపై రూపొందించిన వైజ్ఞానిక అంశాలు సందర్శకులను ఆలోచింపజేశాయి. టీఆర్‌ఎస్ నాయకుడు కంచర్ల శివారెడ్డి వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నమూనా, సోలార్ సిస్టమ్, రైల్వే ప్రాజెక్టు, రోబో, ఫైర్ అలారం, రీసైక్లింగ్ వాటర్, థర్మల్, హైడల్ ఎలక్ట్రిసిటీ, హైదరాబాద్ బస్‌స్టేషన్, సారవంతమైన భూముల సంరక్షణ, కాలుష్యం నుంచి పరిరక్షణ, మెట్రోస్టేషన్ పని విధానం, జాతీయ రహదారుల ప్రాధాన్యత తదితర అంశాలపై ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, కె.భారతి, కె.కార్తీక్, పాఠశాల ప్రిన్సిపాల్ కె.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలకు ఏకాగ్రతతో చదవాలి

సైదాబాద్: పదవ తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఏకాగ్రతతో సిద్ధం కావాలని ప్రముఖ విద్యావేత్త, కేంబ్రిడ్ విద్యాసంస్థల అధిపతి కె.శంతన్‌కుమార్ సూచించారు. శుక్రవారం సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు వార్షిక పరీక్షల పట్ల భయం వీడి, ప్రణాళికాబద్ధంగా చదుకోవాలన్నారు. పరీక్షలు రాసే సమయంలో కూడా ఒత్తిడికి లోనుకాకుండా మానసిక ప్రశాంతతో సరైన సమాధానాలు రాయాలన్నారు. పదవ తరగతిలో వివిధ అంశాలు, పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో బాల, బాలికలు ఆటపాటలతో, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేసారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఝాన్సీ

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 23, వంకాయ 23, బెండ 55, పచ్చిమిర్చి 45, కాకర 44, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 11, క్యారెట్ 19, దొండ 50, ఆలు 18, ఉల్లి 16, గోకర 45, దోస 35, సొర 15, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 50, అర్వి 68, మునగ 55, చిలగడదుంప 40, బీట్‌రూట్ 19, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 60, కాప్సికమ్ 50 ప్రకారం ధర పలుకుతున్నాయి.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

చాదర్‌ఘాట్: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర వికలాంగుల, వయో వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖ డైరెక్టర్ శైలజ అన్నారు. శుక్రవారం మలక్‌పేటలోని ప్రధాన కార్యాలయంలో వికలాంగుల ఎల్డర్స్‌లైన్, పీడబ్ల్యూడీ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... మహిళలు సహనశీలురని, లక్ష్యసాధనలో వెనుకంజ వేయకుండా ముందుకు సాగాలన్నారు. ఆర్థికంగా పురోగతి సాధించప్పుడే వారు అన్ని రంగల్లో అభ్యున్నతి సాధిస్తారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. హైదరాబాద్ జిల్లా ఏడీ రాజేందర్, రంగారెడ్డి జిల్లా డీడబ్ల్యూఓ తిమోతి, జీఎం ప్రభంజన్ రావు, వికలాంగుల సంఘం నాయకుడు నారా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ శైలజ

స్ఫూర్తిప్రదాత సావిత్రీబాయి పూలే



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నగౌడ్

మన్సూరాబాద్: దేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతి జ్యోతి సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. మన్సూరాబాద్ సహారాస్టేట్స్‌కాలనీ 2వ గేటు వద్ద ఉన్న సావిత్రీబాయీ పూలే విగ్రహానికి మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఎన్‌రెడ్డినగర్‌కాలనీ మాజీ కార్పొరేటర్ ముద్దగొని లక్ష్మీప్రసన్నగౌడ్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై.. మహిళలకు విద్య ఆవశ్యకతను సమాజానికి ఎలుగెత్తి చాటిన ధీర వనిత సావిత్రాబాయి పూలే అని కొనియాడారు. ఆమె చూపిన బాటలో పయనిస్తూ మహిళా లోకం విద్యతోపాటు అన్నిరంగాల్లో తమ సత్తాచాటుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నేతలు మేడిగ శ్రీధర్, స్వామి, పిడికిలి రాజు, భిక్షంగౌడ్, కేవీ గౌడ్, మధుసూదన్‌రావు, పోచబోయిన జగదీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సైదాబాద్ కల్యాణ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న హరిగౌడ్ తదితరులు



సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు

సైదాబాద్ డివిజన్‌లో...

సైదాబాద్: సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ అన్నారు. సావిత్రీబాయి వర్ధంతి సందర్భంగా సైదాబాద్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఓబీసీ మోర్చా నాయకులు రాజేష్, రాజీవ్ ఆచార్య, నవీన్‌కుమార్, సునీల్‌కుమార్, చంద్రకాంత్, ప్రతీక్, శివ, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రామంతాపూర్: మహిళా దినోత్సవం సందర్భంగా హృదయ భారతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మక్కపాటి మంగళ ఆధ్వర్యంలో బాల భారతి స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయురాళ్లు, ఆయాలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళ మాట్లాడుతూ.. మహిళలు సాధికారిత సాధించి ఆర్థిక అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షులు కపిర్తేశ్వర్‌రావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.



సాలార్‌జంగ్ మ్యూజియంలో 'సిన్స్' సదస్సు

చార్మినార్: నాణేల పరిశోధన నిరంతరం కొనసాగాలని సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం సహకారంతో సౌత్ ఇండియన్ నుమిస్మాటిక్ సొసైటీ(సిన్స్) శుక్రవారం తన సొసైటీ 31వ వార్షిక సదస్సును మ్యూజియంలోని ఈస్టర్న్ బ్లాక్‌లో నిర్వహించారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో భారత ప్రభుత్వ మింట్ సీజీఎం డాక్టర్ వి.ఎస్.ఆర్.నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సును మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి అతిథులను ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. పురాతన నాణేల పరిశోధనలో సిన్స్ కృషి చేస్తుందని అభినందించారు.